# ఇంగువ కట్టిన గుడ్డ

**- సింహప్రసాద్**





"అమ్మానాన్నా! నన్ను క్షమించండి. లోకంలో నా అంత దురదృష్టవంతుడూ దౌర్భాగ్యుడూ వుండడు. నాకేమీ కలిసి రావట్లేదు. ఉద్యోగం ఎండమావి అయ్యింది. పరాజయాలు నిరాశలు నిట్టూర్పులు కన్నీళ్ళు ఇంకా భరించడం నావల్లకాదు. అందుకే ఈ భూమ్మీదనుంచి శలవు తీసుకుంటున్నాను. మీకిది తీరని దుఃఖాన్ని కలిగిస్తుందని తెలుసు. అయినా తప్పట్లేదు. జన్మ ఇచ్చిన మీకేమీ చెయ్యలేకపోయాను. అందుకు సిగ్గుతో చితికిపోతున్నాను. నేనసలు పుట్టనే లేదనుకోండి. నన్ను మరచిపోండి. అమ్మా! నాన్నా! సెలవు......

ఇట్లు

విజయరత్నం

పోలీసులకు విజ్ఞప్తి: నా చావుకు ఎవరూ కారణం కాదు. దయచేసి ఎవర్నీ వేధించొద్దు. నా శవాన్ని మా తల్లిదండ్రులకు అప్పగించాల్సిందిగా కోరుతున్నాను.

ఉత్తరం రాయటం పూర్తిచేశాడు రత్నం.

కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

లెటర్ని మడిచి చొక్కా జేబులో పెట్టుకున్నాడు. లుంగీని మెలి తిప్పి తాడులా చేశాడు. ఫ్యాన్‌కి వెయ్యడానికి సరిపోలేదు. పైగా లావుగా వుంది. 'లాభం'లేదన్పించింది.

ఇంకేదైనా దొరుకుద్దేమోనని గదంతా వెదికాడు. ఏమీ దొరకలేదు. తాడు బెటరన్పించింది.

తలుపులేసేసి దగ్గర్లోని షాపుదగ్గరికెళ్ళాడు. లాగి పరీక్షించి గట్టి ప్లాస్టిక్ వైర్ కొన్నాడు.

ఎవరో తరుముతున్నట్టు గబగబా రూముకొచ్చాడు. తాడు ఫ్యాన్‌కి వేసి లాగాడు. రెక్కలు వంగిపోయాయి. తన బరువుని ఆపలేవన్పించింది. రాడ్‌కి వేశాడు. బాగుందన్పించింది. కాళ్ళ క్రిందికి స్టూలు జరిపాడు.

ముడి సర్రున జారి ఉచ్చు బిగిసేలా చేసి దాన్ని మెడకి తగిలించుకోబోతూ ఆగాడు.

కడకి తన బతుకిలా అర్ధాంతరంగా ముగియబోతోందన్నమాట!

ఇంకెంత? కొన్ని క్షణాలు! అంతే. ఆ తర్వాతంతు హాయే. బాధల్నుంచి బరువుల్నించి విముక్తి లభిస్తుంది!

దీర్ఘంగా నిట్టూర్చాడు.

ఈ ప్లాస్టిక్ తాడు మెడకి బిగుస్తూ ఊపిరాపుతూ మెడ ఎముకల్ని విరుస్తూ కొంచెం కొంచెం చొప్పున చంపుతోంది. తను గిలగిలా తన్నుకుంటూ అరుస్తూ చావటం-చాలా బాధాకరం. నరకయాతనే. ఇంతకంటే తేలిగ్గా మరణించే మార్గం వుంటే బావుణ్ణు!

ఇలా బలవంతంగా ప్రాణం తీసుకున్నవాళ్ళు వికృత ముఖంతో కనుగుడ్లూ నాలికా బయటికొచ్చి లాగు ఖరాబుచేసి... వొద్దొద్దు. ఆ దృశ్యం వూహించుకోడానికే భయంగా వుంది!

ఏదో రకంగా రెండు నిమిషాలు భరించక తప్పదు...!

ఏదో గుర్తురాగా స్టూలుమీంచి దిగాడు. తల్లిదండ్రుల ఫొటోని ఆఖరిసారిగా చూశాడు. కన్నీరు వరదయ్యింది.

ఫొటోని బోర్లా పండేశాడు.

వేంకటేశ్వరస్వామి కాలండర్ ముందు నిలబడి చేతులు జోడించాడు.

"దేవుడూ! మళ్ళీ జన్మంటూ వుంటే నన్ను ధనవంతుల ఇంట్లో పుట్టించు. ఉద్యోగం ఉపాధి లేకపోయినా హాయిగా బ్రతికే అవకాశం కల్పించు..."

మళ్ళీ స్టూలెక్కి ఉరితాడుని మెడకి తగిలించుకున్నాడు.

తలుపు చప్పుడయ్యింది. విసుగ్గా చూశాడు. బాది బాది వెళ్ళిపోతారని ఉగ్గబట్టాడు. కాని దబదబ బాదుతూనే వున్నారు.

సమయం సందర్భం లేదని రుసరుస లాడాడు. తాడుని ఫాన్ మీదకి విసిరేసి విసురుగా వెళ్ళి తలుపు తీశాడు రత్నం.

"హాయ్!"

ముఖమంతా నోరు చేసుకుని నవ్వుతూ పలకరించింది ఎదురింట్లో వుండే అమ్మాయి.

ఇబ్బందిగా నవ్వేడు.

"మీతో అర్జంటు పనిబడింది. డిస్టర్బ్ చేశానా?"

"అహ లేదు లేదు."

"లోపలికి రాకూడదా?"

అడ్డం తప్పుకుంటూ "రండి రండి" అన్నాడు అయిష్టంగానే.

"మీరేదైనా సీరియస్ పనిలో వుంటే చెప్పండి వెళ్ళిపోతాను."

"అలాటిదేం లేదు కూర్చోండి..." మొహమాటపడ్తూనే స్టూలు జరిపాడు.

పిల్లతెమ్మెరలా లోపలికొచ్చింది. కమ్మని పరిమళ తరంగాలు గదంతా వ్యాపించినట్టు అనుభూతి చెందాడు.

"మీరు చాలా మంచివారు. చాన్నాళ్లనుంచి అబ్జర్వ్ చేస్తున్నాను కదా ఒక్క బ్యాడ్‌హేబిట్టూ లేదు..."

పొంగిపోయాడు.

ఒక అందమైన అమ్మాయి తిన్నగా తన గదిలోకొచ్చింది. వస్తూనే తనని గమనిస్తున్న సంగతి చెప్పింది. అంతటితో ఆగక మంచివారంటూ పొగిడింది!

ముఖాన్ని అర్జంటుగా ప్రసన్నంగా మార్చేసుకుని అన్నాడు "మీ నవ్వంటే నాకు చాలా ఇష్టం. ప్రాణం లేచొచ్చినట్టు అన్పిస్తుందంటే నమ్మండి. దానికన్నా కూడా......"

ఆమె ఏమనుకుంటుందో అన్పించి ఆగాడు.

"చెప్పండి. ఏమీ అనుకోను. ఫ్రాంక్‌నెస్ నాకెంతో ఇష్టం"

"మీరు మెడలో వేసుకునే ట్యాగ్ నాకు చాలా చాలా ఇష్టం. మీరు కన్పిస్తే చాలు దాన్నే చూస్తాను."

నవ్వింది. "ఐడీ కార్డా? నిజమే. అది నా హోదాకి జీతానికి భద్రతకి భరోసాకి సోషల్ స్టేటస్‌కి గుర్తు. మీకూ జాబ్ రాగానే మీకూ ఇలాటిదిస్తార్లెండి..."

"నాకా అవకాశం లేదు."

"అలా అంటారేవిటి? 'బీ పాజిటివ్' గురించి రేపు మా సాఫ్ట్‌వేర్ కంపెనీలో చిన్న ఉపన్యాసం ఇవ్వాలి. మీరు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కి బాగా ప్రిపేరవుతూంటారు కదా కొన్ని చక్కని పాయింట్లు చెబుతారనొస్తే నెగిటివ్‌గా మాట్లాడతారేంటి?"

"నాది కడుపు నిండిన బేరం కాదు."

"రేపూ ఇవాళ్టిలానే వుంటుందనేవిటి?"

"వుండి తీర్తుంది. ఎలాంటి మార్పూరాదని రాసివ్వగలను."

"భలేవారే. కలలు కనండి వాటిని నిజం చేసుకోండి అని అబ్దుల్ కలాంగారు చెవినిల్లుకట్టుకుని పోరుతోంటే కలలు రెక్కలు కత్తిరించుకున్నట్టు మాట్లాడతారేవిటి!"

"చాలా కలలుకన్నాను. అవన్నీ కల్లలైపోయాయి!" నిర్లిప్తంగా అన్నాడు.

"నేన్నమ్మను. మీరు సీరియస్‌గా కలలు కన్నారా?"

"ఒకటారెండా ఎన్నని చెప్పను? మామూలు కలలు కాదు పంచరంగుల కలలు కన్నాను. ప్చ్. తెల్లారేసరికి అవన్నీ పూరేకుల్లా రాలిపోయాయి."

"ఎక్కడో ఏదో లోపం వుంది. కలలు నిజాలు కావాలంటే వాటిపట్ల గాఢత వుండాలి. వాటితో మమేకం కావాలి. అదే జీవిత ధ్యేయం కావాలి. అదే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కావాలి. అప్పుడించక్కా గొంగళి పురుగులు కాస్తా సీతాకోక చిలుకలైపోయి డాన్సేస్తాయి."

"పుస్తకాల కబుర్లు చెప్పడానికీ చదవడానికీ మాత్రమే బావుంటాయి."

"నేను భట్టీయం కేండిడేట్‌ని కాదండి బాబూ. సరే. మీ పాయింటుకే వద్దాం. మీ డ్రీమ్స్ ఎంత స్ట్రాంగో అంచనావేద్దాం. మీరు వేటివేటికి ప్రిపేర్ అయ్యారు అవుతున్నారు?"

"చాలా బ్యాంకు పరీక్షలు రాశాను. గ్రూప్ టూకి ప్రిపేర్ అవుదామనుకున్నాను గాని ఆ ప్రయత్నం విరమించేశాను. ఇక నో మోర్ ట్రయల్స్!"

ఇంతింత కళ్లతో ఆశ్చర్యంగా చూసి అంది "సాఫ్ట్‌వేర్ రంగం డౌన్ అవడంతో అంతా బ్యాంకు పరీక్షలమీద పడ్డారు. సో పోటీ ఎక్కువయ్యింది. దానికి తగ్గట్టు ప్రిపేరయ్యారా? కోచింగు తీసుకున్నారా?"

"వేలకువేలు పోసి కోచింగ్ తీసుకోగల స్తోమతు నాకు లేదు."

"పోనీ రోజూ లైబ్రరీకెళ్ళి కనీసం అయిదారు గంటలు రిఫరెన్సు బుక్కు చదివారా? ప్రాక్టీసు చేశారా? శకుంతలాదేవి పజిల్స్ సాల్వ్ చేశారా? అగర్వాల్ రీజనింగ్ ఫాలో అయ్యారా? అర్థమెటిక్స్ ఎవరిది చదివారు? ఎన్ని మోడల్ పేపర్లు చేశారు? ఒక్కోదానికీ ఎంత టైం తీసుకున్నారు? రోజుకెన్నిచేశారు? మీరెందులో స్ట్రాంగ్? మీరెందులో వీక్? వీక్‌ని స్ట్రాంగ్‌గా మార్చుకోడానికి ఏ వ్యూహం అనుసరించారు? ఎవరెవరిని గైడెన్సు తీసుకున్నారు? మీ ప్రతిభ ఇంకా పెరగడానికి మీరేంచేశారు ఏం చేస్తున్నారు?... ..."

జడివానలా కురిశాయి ప్రశ్నలు.

ఉక్కిరి బిక్కిరయ్యాడు. ఇబ్బందిగా చూశాడు.

"ఫ్రాంక్‌గా చెప్పండి. నేనేమీ అనుకోను."

"మరీ సీరియస్‌గా గాకపోయినా బాగానే ప్రిపేరయ్యాను. కాని రాలేదు. అయినా లంచాలిచ్చే వాళ్ళకీ రికమండేషన్ చేయించేవాళ్ళకీ వస్తాయి గాని నాబోటివాడికి రావు" నిరాశగా అన్నాడు.

"లంచం తీసుకుని ఉద్యోగాలువేసే వార్ని మీరు కలిశారా?"

"అహ..."

"మరంత ఖచ్చితంగా ఎలా చెబుతున్నారు?"

"లోకంతీరు అలాగే వుంది కదా!"

"నేనలా అనుకోవడం లేదు. గ్లాసులో సగం నీరుందని నేనంటున్నాను. సగం ఖాళీగా వుందని మీరంటున్నారు. రెండూ ఒకటే ఎలా అవుతుంది?"

అయోమయంగా చూశాడు.

"మా బ్రదర్‌కి స్టేట్ బ్యాంకులో వచ్చింది. నా ఫ్రెండ్ వాళ్ళ కజిన్‌కి ఇండియన్ బ్యాంక్‌లో వచ్చింది. వాళ్ళకి కేవలం మెరిట్ వల్లే వచ్చింది. మీరు చెప్పే బాపతు ఒకరో ఇద్దరో వుండొచ్చు. అలా అని మెరిట్‌ని ఎవరూ తోసిపుచ్చరు కదా. మెరికల్లాంటివారు అక్కర్లేదని ఏ

ఉద్యోగం రాలేదని మార్కులు తక్కువొచ్చాయని తల్లి తిట్టిందని ప్రియుడు కాదన్నాడని సూయిసైడ్లు చేసేసుకుంటున్నారు. ఎంత పిరికివాళ్ళో చూడండి. అమ్మ నవ మాసాలు మోసి జన్మనిచ్చింది ఇలా అర్థాంతరంగా చిదిమెయ్యడానికా?

అధికారీ అనుకోరు కదా. పోటీ ఎక్కువగా వున్నప్పుడు అందుకు ధీటుగా ప్రిపేరవ్వాలి. మనకి రాకపోతే ప్రయత్న లోపమేమిటో గుర్తించాలి. సవరించుకోవాలి. మళ్ళీ పోటీపడి విజేత కావాలి. అంతే తప్ప ఏదేదో వూహించుకుని ఎవరెవర్నో నిందించడం మనల్ని మనం మోసగించుకోవడం కాదంటారా?"

విసుగ్గా అన్పించిందతడికి. "ఇంకా సోది అనవసరం. అవేమీ నా బుర్రలోకి ఎక్కకుండా తాళం వేసేశాను. మీరొచ్చిన పని చూసుకెళ్తే..."

"నేనుండటం మీకిష్టం లేనట్టుంది. వెళ్లిపోతాన్లెండి" లేచింది.

"అలాటిదేం లేదు. కూర్చోండి. ఇంత రాత్రివేళ వచ్చినపనేంటో చెప్పండి."

"రెండు పనులమీద వచ్చాను. ఒకటి పాజిటివ్ యాటిట్యూడ్ గురించి రెండు చక్కని పాయింట్లు చెబుతారని. మీకో విషయం చెప్పనా? నాది పాజిటివ్ యాటిట్యూడ్. కాని నా బ్లడ్ బీ నెగటివ్!"

పడీ పడీ నవ్వింది. నవ్వుతోంటే ఆమె ఎంత ముద్దొస్తోందో అనుకోకుండా వుండలేకపోయాడు.

ఎంత నిర్మలంగా వుందా నవ్వు! బాధలూ నిరాశలూ వుంటేగా!

"అసలెవరైనా ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారు?" హఠాత్తుగా అడిగింది.

తడబడ్డాడు. "నాకేం తెలుసు?"

"ఉద్యోగం రాలేదని మార్కులు తక్కువొచ్చాయని తల్లి తిట్టిందని ప్రియుడు కాదన్నాడని సూయిసైడ్లు చేసేసుకుంటున్నారు. ఎంత పిరికివాళ్ళో చూడండి. అమ్మ నవ మాసాలు మోసి జన్మనిచ్చింది ఇలా అర్థాంతరంగా చిదిమెయ్యడానికా? అసలు జన్మనిస్తూ అమ్మపడే నొప్పుల బాధ గురించి ఒక్క క్షణం ఆలోచిస్తే ఎవరూ అలా చెయ్యసాహసించరు. ఆ యాతన పడలేక చచ్చిపోతే బావుండ్ననుకుంటుందిట ప్రతి తల్లీ. ప్రసవించాక బిడ్డ లేలేత మోముని చూశాక ఆ బాధ ఆ ఆలోచన ఆ వైరాగ్యం అన్నీ మరచిపోతుందిట. అవునూ- నీకెప్పుడైనా మీ అమ్మ గుర్తొస్తుందా?"

అవునంటూ తలాడించాడు.

"నాకూ అంతే. ప్రతి కష్టంలోనూ అమ్మను తలచుకుంటా. సమస్య తేలికైపోతుంది. కొత్త శక్తి కొత్త ఉత్సాహం పుట్టుకొస్తాయి. మీకూ అంతేనా?"

ఏం చెప్పాలో తోచలేదు. తలొంచుకున్నాడు.

"పోనీ ఇది చెప్పండి. జాబ్ రాలేదని అనుకున్నది జరగలేదని మీరు ఆత్మహత్య చేసుకుంటారా చెప్పండి?"


కంగారు పడ్డాడు. తన ఆలోచన పసిగట్టిందేమోనని కలవరపడ్డాడు.


"అహహ అబ్బెబ్బే అలాటిది చెయ్యను..."

"నాకు తెలుసు మీరు బ్రేవ్ మాన్. వెన్నిచ్చి పారిపోయే రకం కాదు. అందుకనే రెండోపని కూడా పెట్టుకు నొచ్చాను. మీకెలా చెప్పాలో తోచటం లేదు. చెప్పేక మీరెలా తీసుకుంటారోనని... అయినా చల్లకొచ్చి ముంత దాచడం ఎందుకులెండి. ఐ లవ్యూ. మనం పెళ్లి చేసుకుందామా?"

అదిరి పడి చూశాడు. ఆమె తన సమాధానంకోసం ఇళ్ళంతా కళ్ళు చేసుకుని ఉద్విగ్నమై చూస్తోంది.

(మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

ఎండి బీటలువారిన భూమిమీద తొలకరి జల్లు పడగా పులకించినట్లు పులకించాడు రత్నం.

"మీరేమంటున్నారో నాకేం అర్థంకావట్లేదు" సంభ్రమంలో నిలువునా కూరుకుపోతూ అన్నాడు.

"మెల్లగా అర్థమవుతుంది లెండి. ఈ రాత్రి బాగా ఆలోచించి రేపు మార్నింగ్ మీ అభిప్రాయం చెప్పండి. ఇది లైఫ్ సమస్య. అన్ని రకాలుగా ఆలోచించండి. మీకో సంగతి చెప్పనా? వాస్తు పండితులు దిశ మారితే దశ మారుతుందంటారు. నన్నడిగితే బ్యాడ్ ఫేజ్‌లో ఇంటి దిశ కాదు మనిషి ఆలోచనల దిశ మారాలంటాను. అతడి మార్గం కన్న ఆలోచన దృక్పథం మారాలి. కొత్తదారి వెదుక్కోవాలి. అప్పుడు దశ తిరిగి తీరుతుంది. ఏమంటారు? మీరూ దిశ మార్చుకుని ఆలోచించండి..."

అది కొత్త సంగతతడికి. చిత్రంగా చూశాడు. అందులో అభినందన వుంది.

"ఓకే? ఓకే...!" తనే ప్రశ్నించి తనే జవాబు చెప్పుకుని 'బై' చెప్పి వెళ్ళిపోయింది.

వెళ్తూ వెళ్తూ ఒక చూపూ ఒక చిన్న నవ్వూ విసిరేసింది.

స్థాణువయ్యాడు రత్నం.

మనస్సులో తేనె తుట్ట రేగింది. ఎన్నెన్నో ఆలోచనల తేనె టీగలు చెలరేగి కుట్టసాగాయి.

తనమీద తనకి విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకోబోతున్నాడు. కానీమెకి తన మీద అనురక్తి కలిగింది.

ఎంత చిత్రం! ఊహించనిది జరగటమే జీవితమంటారు. ఇంకా ఇలాంటి అద్భుత నిక్షిప్తాలెన్ని దాగివున్నాయో భవిష్యత్తు కడుపులో!

ఉరితాడుని ఆమె చూడకపోవడం మంచిదయ్యిందనుకుంటూ దాన్ని ఫ్యాన్ నుంచి తీసేసి దాచేశాడు.

పడుకుని ఆమె గురించే ఆలోచించ సాగాడు రత్నం.

ఆమె బావుంటుంది. ఈడూ జోడూ అద్భుతం. బాగా చదువుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. బహుశా ముప్పైనలభై వేలు నెల తిరిగేసరికి చేతిలోకొచ్చి పడుతూంటాయి. ఆమె మాటలూ పద్ధతీ చూస్తోంటే తనని ప్రేమిస్తున్నట్టే వుంది. సో- పెళ్ళికి లైన్ క్లియర్. తన పేరెంట్స్ హేపీగా ఫీలవుతారు. ఆమె ప్రోత్సాహంతో ఏ గ్రూప్‌ఒన్నోటూయో కొట్టేస్తాడు. ఆపైన లైఫంతా హ్యాపీ! జోరుగా హుషారుగా షికారు పోదమా......!

అతడి గుండెల్లో ఆశాఝరి జలజలా ప్రవహించింది. నరనరంలో ఆనందానుభూతి గబగబా ప్రాకింది. మనస్సు మధుర భావనల్తో పులకించింది. మైమరచింది!

ఆమె రావటం రెండు నిమిషాలు ఆలస్యమై వుంటే ఈ అద్భుత ఆనంద స్థితి పొందేవాడే కాదు. ఫ్యాన్‌కి తన శవం భయంకరంగా మారి వేలాడుతూండేది!

థాంక్‌గాడ్! సమయానికొచ్చి రక్షించింది. కరక్టుగా చెప్పాలంటే ప్రాణదానం చేసింది. ఆమె తనపాలిట దేవతే!

భవిష్యత్తు ఇంద్రధనుస్సు రంగులు పులుముకుని మెరుస్తూ కన్పిస్తోంటే హాయిగా నిద్రపోయాడు. తీయని కలల పల్లకీలో ఊరేగేడు.

మర్నాటి ఉదయమే ఆమె వచ్చింది.

అతణ్ని చూసి సంతృప్తిగా నవ్వింది. సమ్మోహనంగా అన్పించిందతడికి.

"వెల్కం... కూర్చోండి..."

"ఏమాలోచించారు? నా ప్రపోజల్‌కి ఓకేనా?"

"నేను నిరుద్యోగిని. మీ పెద్ద వాళ్ళేమంటారో!"

"డోంట్ రబ్బిష్. ఉద్యోగం లేదని పశుపక్షులు విచారిస్తాయా? లేదే. ఎంచేత? వాటికి వాటి శక్తిమీద వాటి రెక్కలమీద వాటికున్న నమ్మకం అలాంటిది. మీలో దాగివున్నశక్తి ఇప్పుడే మేల్కొంది. మీరు గగనంలోకి దూసుకుపోవడం ఖాయం. ఒక పల్లెవాడలో జన్మించిన యువకుడు ఐఏయస్ టాపర్ అయిన సంగతి మీకు తెలుసుగా!"

"అవుననుకోండి. కానీ..."

"కానీల కీళ్ళు విరిచెయ్యి మహానుభావా. నాకు మీరు కావాలి. మీ సాహచర్యం కావాలి. మీరు పక్కనుంటే ఈ ప్రపంచాన్నే లెక్కచెయ్యను."

"ఇంత గొప్ప వ్యక్తిని కాదనడానికి ధైర్యం చాలట్లేదు..."

ఆమె బావుంటుంది. ఈడూ జోడూ అద్భుతం. బాగా చదువుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. బహుశా ముప్పైనలభై వేలు నెల తిరిగే సరికి చేతిలోకొచ్చి పడుతూంటాయి. ఆమె మాటలూ పద్ధతీ చూస్తోంటే తనని ప్రేమిస్తున్నట్టే వుంది.

"ఓ మై గుడ్నెస్! స్వర్గం నా చేతికందేసింది!" పరమానంద భరితురాలై అతడి చేతులు పట్టుకుని గిరగిరా తిప్పేసింది.

"ఈ సంతోషం పట్టక నా గుండె గోడలు పగిలిపోతాయేమోనని భయమేస్తోంది..."

"మరీ ఇంత సంబరమా?!" వెర్రి సంబరంగా చూస్తూ అన్నాడు.

"వుండదామరి అమృత భాండం లభిస్తే?"

"నిజానికి నీకన్నా నేనే అదృష్టవంతుణ్ని. ఇంతటి మహద్భాగ్యం ఇంత గొప్పవరం దక్కుతుందని కలలో కూడా అనుకోలేదు. ఇదంతా కలా నిజమా అన్నది తెల్సుకోలేకపోతున్నానంటే నమ్ము..."

"నిజమే. కాని కలగా మిగలనుంది..." ఆమె స్వరం వణికింది. కళ్ళల్లో నీటి పొర కదిలింది.

"అదేవిటి?"

"నా బ్యాడ్‌లక్. నీకు బోల్డంత జీవితముంది. ఎంతో చూస్తావు. ఎన్నో చేస్తావు. మరెంతో సాధిస్తావు. కాని నాకా అవకాశం లేదు...!"

"ఏం ఎందుకులేదు?"

"దేవుడు నా ఆయుష్షురేఖను చిన్నదిగా గీశాడు. నాకు బ్లడ్ క్యాన్సర్. ఇంకో నెలకన్నా ఎక్కువకాలం బతకను..."

విషాదమూర్తిగా మారి విలవిల్లాడింది.

తల్లడిల్లిపోయాడు. ఆమెకేం చెప్పాలో ఎలా ఓదార్చాలో తెలీలేదు. తన చేతివేళ్ళ సందుల్లోంచి బంగారు అవకాశం జారిపోయిందన్న సంగతి తట్టుకోలేకుండా వున్నాడు.

"మిమ్మల్ని చూస్తోంటే ఈర్ష్యగా వుంది. మీరెంతో కాలం జీవిస్తారు. నా ఫ్రెండ్సూ బ్రదర్సూ సిస్టర్సూ రెలటివ్సూ కొలీగ్సూ ఈ చెట్లూచేమలూ అన్నీ అంతా బ్రతికే వుంటారు. నేనొక్కద్దాన్నీ వుండను. ఎంత దారుణం! ఇంతకంటే దౌర్భాగ్యం వుంటుందా చెప్పు? మనం పుట్టింది జీవించడానిగ్గాని ఇలా అర్ధాంతరంగా ఆ కాలంలో చనిపోవడానికా? మీరంతా ఉజ్వల భవిష్యత్తుకోసం పరుగులు పెడుతోంటే నేను చావువైపు అడుగులేయాలా? ఇదెక్కడి న్యాయం?!"

ఏడ్చేస్తూ అతడి భుజాలు పట్టుకుని కుదిపేస్తూ అడిగింది.

అతడు మాట్లాడలేదు. మాటలు రావట్లేదసలు. జీవితం ఎంత గొప్పదో ప్రాణం ఎంత విలువైందో మానవ జన్మ ఎంత ఉత్కృష్టమైందో ఇప్పుడిప్పుడే తెలుస్తున్నట్టుగా వుందతడికి!

"అన్నట్టు నిన్న రాత్రి ఆ ప్రక్క షాపులో నువ్వేదో కొంటున్నప్పుడు నీ జేబులోంచి జారిపడింది. ఇంపార్టెంటేమో జాగ్రత్త చేసుకో."

అందుకుని చూశాడు. రాత్రి రాసిన సూయిసైడ్ నోట్!

ఇబ్బందిగా నవ్వి, "వేస్ట్ పేపర్" అంటూ ముక్కలుగా చింపేశాడు.

ఆమె కళ్ళు మెరిశాయి. చటుక్కున అతడి చేయి పట్టుకుని "ఒక్క ప్రామిస్ చెయ్యగలవా నాకోసం... ప్లీజ్..."

తలూపాడు.

"బ్రతికినన్నాళ్ళూ నువ్వు నన్ను గుర్తుపెట్టుకుంటావా? కనీసం కష్టాలెదురైనప్పుడు సమస్యలొచ్చి పడినప్పుడైనా నన్ను తలచుకుంటావా?

ఆ రకంగా నీ తలపుల్లో నన్ను అమరురాల్ని చేస్తావా మిత్రమా?" ఆర్తిగా అడిగింది.

నీళ్ళు నిండిన కళ్ళతో ఆమె చేతిలో చెయ్యివేసి "ప్రామిస్" అన్నాడు.

"నా పేరు తెలుసుకదా?"

చిన్నబుచ్చుకుంటూ తల అడ్డంగా వూపాడు.

"ఆశాలత."

దుఃఖోద్ధృతిని ఆపుకుంటూ పరుగుపరుగున వెళ్ళిపోయింది.

ఆ తర్వాతామె మరి కన్పించలేదతడికి.

కాని రత్నం ఆమె మాటల్ని మర్చిపోలేదు. ఇంగువకట్టిన గుడ్డకి అంటిన సువాసనలా ఆమె ఆలోచనలూ వదల్లేదు.

కొత్త కలలుకన్నాడు. దీక్షతో శ్రమించాడు. గ్రూపు టూకి సెలక్టై డిప్యూటీ తాశిల్దారయ్యాడు. చక్కని అమ్మాయిని పెళ్ళిచేసుకుని సుఖంగా వున్నాడు.

అప్పుడప్పుడూ 'ఆమె'గుర్తొచ్చి గుండె కలుక్కుమంటూ వుంటుంది.

'పాపం ఆమె బ్రతికి వుండి వుండదు. అల్పాయుష్కురాలు. దురదృష్టవంతురాలు' అనుకుంటూ వుంటాడు.

ఆమె బెంగళూరులో జాబ్ చేస్తోందనీ పెళ్ళిచేసుకుని హ్యాపీగా వుందనీ అతడికి తెలీదు.

ఆమె ఆడిన చిన్న అబద్ధం పెద్ద జీవితాన్ని నిలబెట్టిన సంగతి అతడికెప్పటికీ తెలిసే అవకాశం లేదు! ✲

**రచయిత చిరునామా:**
**సి.వి.ఎస్.ప్రసాద్,**
401, మయూరి ఎస్టేట్స్, ఎంఐజి-2- 650
కెపిహెచ్‌బి కాలనీ, హైదరాబాద్- 500 072.